


● దొత్తివాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)
● మందపల్లి - పలికేరి వాగుపై నూతనంగా నిర్మించిన వంతెన

వాగులు వంకలే దారులు

- జిల్లాలో రోడ్లు లేక తల్లడిల్లుతున్న పల్లెలు
- పస్పుల్లా, దొత్తివాగులతో గిరిజనులకు ఇబ్బందులు
- వంతెనలు లేక వర్షాకాలంలో తిప్పలు
- సర్కారుకు పట్టని గిరి పల్లెల గోడు

నిర్మల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనేక మారుమూల పల్లెల దారులకు వాగులు, వంకలు అడ్డుతగులుతున్నాయి. ఈ వాగులు, వంకలపై ఏళ్ల నుంచి బ్రిడ్జిలు నిర్మించకపోతుండడంతో మారుమూల పల్లెలు వర్షకాలంలో జనజీవనానికి దూరంగా ఉండిపోతున్నాయి. వాగు లు, వంకలు పొంగి పొర్లడంతో రాకపోకలన్నీ నెలల తరబడి స్తంభించిపోతున్నాయి. ఆధునిక కాలంలో మానవుడు అంతరిక్షానికి సైతం సులువుగా చేరుకుంటున్నప్పటికీ ఈ మారుమూల పల్లెల ప్రజలకు మాత్రం దారులు లేక రాకపోకలు శాపంగా మారుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని అత్యంత మారుమూల ప్రాంతంలో ఉన్న పెంబి, దస్తూరాబాద్, కడెం మండలాల్లోని అనేక మారుమూల గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది. ఓ భారీ వర్షం కురిస్తే చాలు వీరు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మారుమూల గ్రామాల ప్రజలంతా ఎండకాలంలోనే మూడు నాలుగు నెలలకు సరిపోయే ఆహార వస్తువులను భద్రపరుచుకుంటారంటే పరిస్థితి ఎంత దయనీయ స్థితిలో ఉందో తెలుసుకోవచ్చు. అటవీ అనుమతుల నిరాకరణ ఓ వైపు, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం మరోవైపు గిరిజన పల్లెలకు శాపంగా మారుతోంది. పంచాయ తీరాజ్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు ప్రతీఏటా వాగులపై బ్రిడ్జిలు నిర్మించేందుకే కాకుండా మారుమూల పల్లెలకు రోడ్లను నిర్మించేందు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతుండడం రివాజుగా మారింది. ప్రభుత్వం మాత్రం నిధులు మంజూరు చేయకుండా మారుమూల పల్లెలపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నట్లు విమర్శలున్నాయి.


మందపల్లి టూ చందు నాయక్ తాండ (రాజురా) రోడ్డు, వంతెన శంఖుస్థాపన శిలాఫలకం

దయనీయ దుస్థితిలో పస్పుల్లా వాగు బ్రిడ్జి

మూడేళ్లక్రితం కురిసిన భారీ వర్షాలకు పెంబి మండలంలోని పస్పుల్లావాగుపై ఉన్న భారీ బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో ఈ వాగు ఆవల ఉన్న హరిచంద్‌తాండ, తులసీపేట, పస్పుల్లా, అంకెన, రాయదారి, పోచంపాడ్ తో పాటు తదితర గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఈ పస్పుల్లావాగుపై బ్రిడ్జి డిజైన్ లోపం కారణంగా నిర్మించిన కొద్ది కాలానికే కొట్టుకుపోయినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలను దృష్టిలో పెట్టుకొని ఆర్ అండ్ బి శాఖ అధికారులు తాజాగా అంచనాలను రూపొందించి నిధుల కోసం సర్కారుకు నివేదించారు. అయితే అంచనాలు రూపొందించి సంవత్సరాలు గడుస్తున్నా పాలకులు మాత్రం స్పందించడం లేదు. ప్రతి వర్షకాలంలో వీరు ప్రమాదకరంగా వాగులను దాటుకుంటూ ఉధృత ప్రవాహాన్ని లెక్క చేయకుండా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

దొత్తి వాగుదీ అదే దుస్థితి

పెంబి మండలంలోని దొత్తివాగుపై వంతెన నిర్మాణం జరగకపోతుండడం అలాగే కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇక్కడి ఎనిమిది గ్రా మాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాపల్‌గూడెం, రాంనగర్, సత్తుగూడ, నాయకపుగూడెం, దొంధరి, వస్‌పెల్లి, చాకిరేవు గ్రా మాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. గతంలో ప్రభు త్వం ఈ గ్రామాల సౌకర్యం కోసం దొత్తివాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం అలాగే రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినప్పటికి అటవీశాఖ అనుమతులను నిరాకరించడం శాపంగా మారింది. ఈ గ్రామాల్లో కనీసం కరెంటు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటవీ శాఖ అనుమతుల నిరాకరణ కారణంగా ఏ ఒక్క అభివృద్ది పనిని కూడా చేపట్టలేకపోతున్నారు. అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తున్నప్పటికి అటవీశాఖ కొర్రీలు పెడుతుండడం ఆటంకంగా మారుతోంది.

రెండు హైలెవల్ బ్రిడ్జిలతో గిరి పల్లెలకు సౌకర్యం

కాగా పెంబి మండలంలోని మందపెల్లి గ్రామం నుంచి ఖానాపూర్ మండలంలోని చందు నాయక్ తాండ, రాజురా గ్రామాల వరకు ప్రభుత్వం రూ. 1800 లక్షలతో రెండు హైలేవల్ బ్రిడ్జిలను నిర్మిస్తోంది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పెంబి మండల ప్రజలకు జిల్లా కేంద్రం వెళ్ళేందు కోసం 15 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే పలికేరు వాగుపై కూడా నిర్మిస్తున్న బ్రిడ్జి కారణంగా పలు గ్రామాలకు రాకపోకల సౌకర్యం కలగనుంది.

పస్పుల్లా వంతెన పునర్ నిర్మించాలి : బలరాంనాయక్, తులసీపేట్



వంతెన నిర్మించి సంవత్సరం కూడా గడవక ముందే వర్షానికి కొట్టుకుపోయింది. వంతెన లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఆసుపత్రికి వెళ్ళాలంటే ఎడ్లబండిలో తీసుకువెళుతున్నాం. ఎంతో మంది నాయకులు అధికారులు వచ్చి చూసి వెళ్ళిన ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకొని వంతెనను నిర్మించాలి.

దొత్తివాగుపై వంతెన నిర్మించాలి : సుదర్శన్ దొంధరి



దొత్తివాగుపై వంతెన లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం వైద్యం అందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో దొత్తివాగు దాటే సమయంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నా యి. అధికారులు స్పందించి దొత్తివాగుపై వంతెన నిర్మించాలి.

వంతెన లేక పంట అమ్ముకోవాలంటే కష్టపడుతున్నాం



వంతెన కూలిపోవడంతో హరిచంద్ తాండ, పస్పుల్లా, కోరకంటి, తులసీపేట్, అంకెన, రాయధారి, దయ్యాల మద్ది తదితర గ్రామాల రైతులు పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువెళ్ళడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, నాయకులు స్పందించి ఇకనైనా వంతెనను నిర్మించాలి.

- కిసాన్, తులసీపేట్


ప్రత్యేక డ్రైవ్‌లో ఆదేశాలు ఇస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

పట్టణంలో ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని ప్రధాన బస్టాండ్ రోడ్డుపై అక్రమంగా ఆక్రమించుకుని ప్రజలకు ఇబ్బందులను కలుగనీయవద్దంటూ ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పండ్ల దుకాణాలు, ఆటోలు, ఇతర వ్యాపారస్తులు రోడ్డుకు ఇరువైపులా నిర్వహించవద్దని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని, నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్డులను ఆక్రమించవద్దని నిర్వాహకులకు తెలిపారు. పట్టణ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిపో మేనేజర్

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పండరి సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బస్టాండ్‌లో పరిశుభ్రత, మహాలక్ష్మి పథకం అమలు సౌకర్యాలపై అడిగి తెలుసు కున్నారు. వేసవిలో ప్రయాణికులకు చల్లని మంచినీరు అందించాలని డీఎంకు సూచించారు.

బస్టాండ్ గేట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రించాలి

నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. పండరి సోమవారం మర్యాదపూర్వకంగా ఎస్పీ జానకి షర్మిలను కలుసుకున్నారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. బస్టాండ్ గేట్ల వద్ద ఆటో వారు ప్రయాణికులను, రాకపోకలకు ఇబ్బంది పెడుతున్నారని ఎస్పీకి విన్నవించారు. తగు చర్య తీసుకోవాలని కోరారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

● స్టేటస్ తెలుసుకునేందుకు ట్రాకింగ్ ● ఎస్ఈ బి. సుదర్శనం వెల్లడి

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు కొత్త సర్వీసుల మంజూరును సులభతరం చేసినట్టు నిర్మల్ సర్కిల్ ఎస్ఈ బి.సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తసర్వీస్ మంజూరులో ఏదైనా కారణంతో దరఖాస్తు తిరస్కరించకుండా వినియోగదారుడు స్పందించే విధంగా మరో అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వారికి మెసేజ్ రూపకంగా ప్రతిఒక్క దశలో తెలియ జేస్తామన్నారు. దరఖాస్తు స్థితి తెలుసుకునేందుకు ట్రాకింగ్ చేసే వీలు కల్పించామని వివరించారు. ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు 1912 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని స్పష్టం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడం కోసం కొత్త సర్వీస్ మంజూరు వేగవంతం చేసినట్టు తెలిపారు.

నకిలీ వికలాంగుల పెన్షన్లు రద్దు చేయాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ వికలాంగుల పెన్షన్లు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెద్ద ఎత్తున వికలాంగులకు నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించాడని ఆరోపించారు. ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో అవినీతిపై జరిపిన విచారణ బహిర్గతం కాలేదన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. డాకూరి తిరుపతి, నర్సయ్య పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా ఎజాజ్ అహ్మద్ ఖాన్


ఎజాజ్ అహ్మద్‌ఖాన్

దిలావర్‌పూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల నూత న తహసీల్దార్‌గా ఎజాజ్ అహ్మద్‌ఖాన్ బదిలీపై వచ్చారు. ఇంతకాలం దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా పని చేసిన బి. స్వాతి జిల్లా కలెక్టర్‌కు బదిలీ అయ్యారు. కుంటాల తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎజాజ్ అహ్మద్‌ఖాన్ దిలావర్‌పూర్ మండలానికి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

కుంటాల తహసీల్దార్ కమల్ సింగ్



కుంటాల, మార్చి, 24 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల నూతన తహసీల్దార్‌గా సోమవారం కమల్‌సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎజాజ్ అహ్మద్‌ఖాన్ బదిలీపై దిలావర్‌పూర్ వెళ్లగా ఆయన స్థానంలో నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహి స్తున్న కమల్‌సింగ్ పదోన్నతిపై వచ్చి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు.

ఇసుక వేలం పాట

తానూర్ , మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 26వ తేది బుధవారం ఇసుక వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లింగమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత జనవరీ నెల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పలు వాహనాలను పట్టుకొని సీజ్ చేశామని, ఆ ఇసుకను వేలం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల వారు బుధవారం ఉదయం 1గంటల వరకు రూ. 10వేలు దరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన బీజేపీ నాయకులు

నర్సాపూర్(జి), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ జామామజీద్‌లో సోమవారం రాంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు జంగోల్ల మహిపాల్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తలరాత షార్ట్ ఫిలిం పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తలరాత షార్ట్ ఫిలిం విజయోత్సవ పోస్టర్ ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సినీనటుడు సాయికుమార్ ఆవిష్కరించడం పట్ల నిర్మల్ విశ్వబ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది. సినీ ఆర్ట్స్ భరత్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాయికుమార్ పాల్గొని నటుడు ముప్పిడి సూర్యనారాయణ, డైరెక్టర్ కృష్ణ వర్మను అభినందించారని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ముప్పిడి రాకేష్, సుద్దాల సత్యనారాయణ, తదితరులు కళాశారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదాయపన్ను వివరాలకు సంప్రదించండి

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లు తమ ఆదాయ పన్ను వివరాలు తెలుసుకునేందుకు మంగళవారం ఉదయం 11 గంటల నుండి పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సంప్రదించాలని అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో కోరారు. ట్రెజరీ కార్యాలయం నుండి పన్ను వివరాలు యూనిట్ కార్యాలయానికి చేరినట్టు తెలిపారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్


అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పించన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా అధికారులందరూ సమయానికి ప్రజావాణికి హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణి రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులు కలిగి ఉన్న ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని, ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

టెలిఫోన్ ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, వాటిని నమోదు చేసుకొని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారం కొరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 8 మంది దరఖాస్తుదారులు వివిధ ప్రాంతాల నుండి తమ అర్జీలను సమర్పించారు. దరఖాస్తు వివరాలను వాట్సాప్ ద్వారా స్వీకరించి, ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధిత రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా అందించారు. దూర ప్రాంత ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు పలువురు టెలిఫోన్ ప్రజావాణి అర్జీదారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయాల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

నిర్మల్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షులు భూక్యా రమేష్, నాయకులు అర్చన, జయంతి మాల, అనిత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● దేశంలో క్షీణిస్తున్న రాజకీయ విలువలు ● స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం ● ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అమ్దాన్



పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న తాహెర్ బిన్ అమ్దాన్


అవగాహన కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నిర్మల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అమ్దాన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మారుతి ఇన్ హోటల్‌లో జరిగిన జై బాపు... జై భీమ్... జై సంవిధాన్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతుందని, దీంతో 145 కోట్ల మంది ప్రజలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రపై గ్రామ గ్రామాన తిరుగుతూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గ్రామ గ్రామాన తిరుగుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. దేశంలో రాజకీయ విలువలు క్షీణిస్తున్నాయని, రాజకీయ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మ్రోగించాలన్నారు. నిర్మల్ జిల్లా మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. భారత దేశానికి పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుప్పకూలి పోయిందన్నారు. అలాంటి పరిస్థితులు మన భారత దేశంలో రాకుండా కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు తీవ్రంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నటరాజన్ కూడా బాపూజీ అడుగు జాడల్లో నడుస్తూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. గతంలో ఆమె నిజామాబాద్ జిల్లాలో ఆరు రోజులపాటు పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కుల మత విద్వేషాలకు పాల్పడుతుందన్నారు. ముఖ్యంగా కులాల మధ్య చిచ్చు పెడుతుందని ఆయన ఆరోపించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు మాట్లాడుతూ... కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. ఈ సందర్భంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ అప్సర్ యూసుఫ్ జాహీ, ఖానాపూర్, ముధోల్ కోఆర్డినేటర్లు రాంభూపాల్, రుద్ర భాస్కర్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, నిర్మల్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ భీమ్ రెడ్డి, ఆనందరావు పటేల్‌తో పాటు దేవరకోట ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్, సాయిబాబా ఆలయ చైర్మన్ భూరాజ్, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్లు అప్పాల గణేష్ చక్రవర్తి, గండ్రత్ ఈశ్వర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమ నేత కొట్టే శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


ప్రమోద్‌కుమార్ మృతదేహం

బాసర, మార్చి, 24 : (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో ఆలయానికి వెళ్లే రహదారి ఆర్చి గేట్ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమోద్ కుమార్ (28) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ద్విచక్ర వాహనంపై వస్తున్న ప్రమోద్‌కుమార్ మూల మలుపు వద్ద కంట్రోల్ తప్పి వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టాడు. తలకు బలమైన దెబ్బ తగలడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. స్థానిక ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌లో ప్రమోద్ కుమార్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

ముథోల్‌లో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం


రాబర్ట్ కోచ్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ముథోల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ వెంకట్ సాయి, సువర్ధన్‌లు రాబర్ట్ కోచ్ చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే సిబ్బంది అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ లాలయ్య, హెడ్ నర్స్ పద్మ, కల్పన, ప్రేమలత, స్టాఫ్ నర్సులు భూలక్ష్మి, పద్మ, ఏఎన్ఎంలు భీమ్‌బాయి, అరుణ, ఆరోగ్య మిత్ర గోపీ, ఫార్మసిస్ట్ ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన టేల తొలగింపు


రోడ్డుపై ఉన్న టేలాను తొలగిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా సీసీ రోడ్డును ఆక్రమించి నిర్మించిన రేకుల టేలను సోమవారం ఉదయం 5 గంటలకు గ్రామ పంచాయతీ ద్వారా రేకుల షెడ్డు జేసీబీ సహాయంతో తీసి వేసి, గ్రామ పంచాయతీ సిబ్బంది పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎంపీవో తిరుపతి రెడ్డి మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కైలాస్, పోలీసులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి అధికారులకు ఎలాంటి సంబంధం లేదు



లక్ష్మణచాంద తహసీల్దార్ జానకి

లక్ష్మణచాంద, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టపెల్లి(కె)లో జరిగిన రైతు తోడిశెట్టి భూమన్న ఆత్మహత్యాయత్నానికి అధికారులకు ఎలాంటి సంబంధం లేదని తహసీల్దార్ జానకి సోమవారం వివరించారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వేనంబర్లు 1, 2, 3, 4లలో సర్వే నిర్వహించగా 2.12 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు నివేదికనుపై అధికారులకు కూడా నివేదించినట్లు వెల్లడించారు. ఇది జరిగి కూడా చాలా రోజులు అయ్యిందని, అందువలన ఆయన ఆత్మహత్యాయత్నానికి అధికారులకు ఎలాంటి సంబంధం లేదని మరోసారి స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు


సన్మానిస్తున్న కేంద్ర మంత్రి

ఆదిలాబాద్, మార్చి24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరుగుతున్న దండోర ఉద్యమానికి కిషన్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించారు.

బస్టాండ్‌ను సందర్శించిన డిపో మేనేజర్


బోథ్ బస్టాండ్‌లో ప్రహరీని పరిశీలిస్తున్న డిపోమేనేజర్

బోథ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.పండరి సోమవారం సాయంత్రం బోథ్ బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించడంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, ప్రతి స్టేజీలో బస్సు ఆపి ప్రయాణికులను తీసుకువెళ్లాలని ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఓపీ ఆర్ఎస్ ఇన్‌చార్జి టీవీ రమణ, బోథ్ బస్టాండ్ కంట్రోలర్ మల్లెపూల సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పది పరీక్షకు 33 మంది గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పరీక్ష జరిగింది. సోమవారం జరిగిన పరీక్షకు 10,042 మంది విద్యార్థులకు గాను 10009 మంది విద్యార్థులు హాజరై 33 మంది గైర్హాజరయ్యారు అధికారులు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నేరడిగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతినిత్యం తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎంపీడీవో ఉపాధిహామీ ఎంఈవో, ఐకేపీ ఆధార్ సెంటర్‌లకు వచ్చే రైతులు, ప్రజల కోసం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ నాగారావు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

బోథ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు అడుగంటిపోకుండా బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో రమేష్ సూచించారు. సోమవారం మండలంలోని నిగిని, కంటేగాం లంబడి తండా, మర్లపల్లి గ్రామాలలో పర్యటించి ఆయా గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి వనరుల వినియోగం, బోరు బావుల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల జరిగే లాభాలు రైతులకు వివరించారు. ఉపాధిహామీ పథకం కింద బోర్లవద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా రైతులు నిర్మించుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో ఏర్పాటైన సమావేశాలలో ఆయా గ్రామాల్లోని వ్యవసాయ అధికారులు ఉపాధి హామీ పథకంలో పనిచేసే టీఏలు, ఎఫ్ఏలు రైతులు పాల్గొన్నారు.

నూతన మండలాల్లో జూనియర్ కళాశాలలు మంజూరు చేయండి

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే

సిరికొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సిరికొండ, భీంపూర్, సొనాల మండలాల్లో పక్కా ప్రభుత్వ భవనాలను మంజూరు చేయాలని బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరోఅవర్‌లో ఎమ్మెల్యే మండల సమస్యలపై గళమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిరికొండ మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో నేటికీ త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేక గిరిజన రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటవీశాఖ అధికారులు టైగర్‌జోన్ పేరిట రోడ్లకు, త్రీఫేజ్ కరెంట్, బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వలేమంటూ రైతులను పలు ఇబ్బందులకు గురిచేస్తు న్నారని తెలిపారు.

మల్లాపూర్‌ను విలీనం చేసినందుకు ధన్యవాదాలు

● ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మబొజ్జుపటేల్ సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రివర్యులు సీతక్క మల్లాపూర్ గ్రామాన్ని మళ్ళీ ఇంద్రవెల్లి మం డలంలో విలీనం చేయడంతో పాటు ఉట్నూర్ మండలంలోని సాకేర (జే) గ్రామం పేరు తప్పుగా జమాల్‌నాయక్ తండా నమోదు అయిందని, మళ్ళీ ఆ గ్రామ పేరును సాకేర(జే)గా మార్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామప్రజల సమస్యను పరిష్కరించిన జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు సీతక్కకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

పట్టపగలు ఆలయంలో చోరీ


హుండీ పగలగొట్టిన దొంగలు

బోథ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని అయ్యప్ప సన్నిధానం పెద్దలరాగుట్ట హనుమాన్ ఆలయంలో సోమవారం మిట్టమధ్యాహ్నం చోరీ జరిగింది. గ్రామ పొలిమేరలో ఉన్న అయ్యప్ప సన్నిధానంలో గేటు తాళం పగలగొట్టి దొంగలు లోపలికి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. అనంతరం అక్కడి నుంచి పెద్దలరాగుట్ట హనుమన్ ఆలయంలో వేసి ఉన్న గేటు తాళం పగలగొట్టి లోపలికి వెళ్లారు. అందులో పగులగొట్టి నగదుతో ఉడా యించారు. సాయంత్రం పూట ఆలయ పూజారి రమేష్ పూజ చేసేందుకు వెళ్లిన సమయంలో గేటుకు వేసిన తాళం పగిలి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా హుండీ పగిలిపోయి ఉంది. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని సమీపంలో ఉన్న వారికి చూపించారు.

ఆవిర్భావ సభకు విరాళం

మార్చి, 24 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ సభ ఖర్చుల కోసం ముక్రా(కే) గ్రామస్థులు లక్ష రెండు వేల మూడు రూపాయల నగదును పోగుచేసి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ముక్రా(కే) గ్రామంలో ప్రతి ఇంటికి సంక్షేమం అందిందని, కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే ఆదర్శగ్రామంగా నిలిచిందన్నారు. విరాళం నగదును కేసీఆర్‌కు అందజేయాలని గ్రామస్థులంతా కలిసి మాజీసర్పంచ్ గాడ్గెమీనాక్షికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్, మహిళ రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన లారీ

ఇచ్చోడ, మార్చి, 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమా నాస్పదంగా కనిపించిన భారీవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం పట్టుబడింది. లారీని నేరుగా పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారీ వాహనం లారీలో 580 సంచుల బియ్యం దాదాపు 290 క్వింటాళ్ల బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యం విలువ దాదాపు రూ. 5.80లక్షల విలువ ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే పైలెట్ ప్రజావాణి : సీపీవో

తాంసి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలట్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని సీపీవో వెంకటరమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ బహిరంగ చర్చ కార్యక్రమంలో మండలంలో 64 మంది తమ సమస్యలపై ప్రజావాణి సమాచార సహాయకేంద్రంలో దరఖాస్తులు చేసుకున్నారు. విచారణకు 23 మంది హాజరై తమ సమస్యలని వినిపించారు. ఆరుగురి సమస్యలను బహిరంగ విచారణలో పరిష్కారం చేసినట్లు ప్రజావాణి ప్రిసైడింగ్ అధికారి, జిల్లా ప్రణాళిక అధికారి బి.వెంకటరమణ తెలిపారు. ప్రజావిచారణలో ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి, డీటీ గణేష్, పౌరసరఫరాల శాఖ అధికారులు, పౌర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో మాజీ సర్పంచ్ చేరిక

నేరడిగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల క్యాంపు కార్యాలయంలో సోమవారం మాజీ సర్పంచ్ చేరారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడేగజేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ గుడిహత్నూర్ మండలంలోని మన్నాపూర్ మాజీసర్పంచ్ నర్సటే సునీల్ చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తూ కోట్ల రూపాయల నిధులు నియోజకవర్గానికి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడుపుతున్నందుకుగాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. అదే విధంగా ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలను ప్రజలకు ఎంతో మేలు చేసేవిధంగా ఉన్నాయన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు కలిసి ముందుకు వెళ్లాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తోడశం భీంరావు, ససానే మాధవ్, శివాజీ, యండి సద్దాం, అన్నుసింగ్ పాల్గొన్నారు.

ఎడతెగని 'డబుల్' పంచాయితీ

(5వ పేజీ తరువాయి...)

వారందరికీ ఇళ్ల నిర్మాణాలను చేపట్టి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

డిమాండ్ ఎక్కువ.. మంజూరు తక్కువ

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నా.. ఇళ్ల మంజూరు తక్కువగా చేయడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గానికి 3,500 చొప్పున కేటాయిస్తే.. ఏ మూలాన సరిపోవన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అవి కూడా మొదటి దశలో ఒక గ్రామంలోనే నిర్మించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజాపాలన కింద దరఖాస్తులను స్వీకరించడం తో జిల్లాలో గృహలక్ష్మి పథకానికి వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలలో గృహలక్ష్మి పథకానికే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. మొదట ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకాన్ని కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. పూర్తిస్థాయిలో మంజూరు చేయక పోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేను చేపట్టి లబ్ధిదారులను గుర్తించిన ఇళ్లను మంజూరు చేయక పోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. ఇళ్ల నిర్మాణాలకు అనువైన సమయం మించిపోతున్నా.. ప్రభుత్వం ఇందిరమ్మ పథకంపై ప్రత్యేకదృష్టిని సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

కుల బహిష్కరణ కేసులో ఆరుగురికి జైలు

నేరడిగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కుల బహిష్కరణ కేసులో ఆదిలాబాద్ స్పెషల్ కోర్టు న్యాయాధికారిణి దుర్గారాణి ఆరుగురికి నెల రోజుల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించారు. నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు నేరడిగొండ మండలం వడూర్ గ్రామానికి చెందిన తీగల ఎడన్నను ఆస్తి వివాదంలో కులపెద్దలు పంచాయతీ నిర్వహించి 2019లో కులబహి ష్కరణ చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితులకు ఆదిలాబాద్ స్పెషల్ కోర్టు న్యాయాధికారిణి దుర్గారాణి ఆరుగురిపై నేరం రుజువు కావడంతో తీర్పును వెలువరించారు. ఆరుగురికి నెలరోజుల జైలు శిక్షతో పాటు 500 జరిమానా విధించామని నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మురికినీరు రోడ్డుపై రాకుండా చర్యలు

బోథ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేదం పాఠశాల ఎదుట మురికినీరు రోడ్డుపైనుంచి ప్రవహించడంతో ఆర్అండ్‌బీ రోడ్డు చెడిపోయింది. దీంతో పాదాచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం రాగా అధికారులు స్పందించారు. సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది మురికినీటి కాలువను తవ్వి నీరు రోడుపై రాకుండా చర్యలు చేపట్టారు. దీంతో మురికి నీరు రోడ్డు పక్కనుంచి కాల్వ ద్వారా వెళ్ళిపోతున్నాయి.

ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం

తాంసి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం దక్కిందని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం తాంసీ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్ళతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, తరుడి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, వినయ్ సాగర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గం

నేరడిగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గం లభిస్తుందని కామారెడ్డి జిల్లా తాడ్వాయికి చెందిన శబరి మాత భక్తుడు దేవారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆల యంలో గీత పారాయణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన 18 అధ్యాయాలు గీత పారాయణం చేశారు.

మూసీ ప్రక్షాళన నిధులపై స్పష్టతనివ్వాలి

● అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్ అర్బన్/దిలావర్‌పూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మూసీ ప్రక్షాళనకు కేటాయించిన రూ.1,500ల కోట్ల నిధులు దేనికి కేటాయిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ అలవికాని హామీలు ఇచ్చి ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. ఇంటర్నేషనల్ ఫండింగ్ తెస్తామని మంత్రి జూపల్లి అనడం సబబు కాదన్నారు. ఇంటర్నేషనల్ ఫండింగ్ ఎలా తెస్తారో సభకు తెలియజేయాలన్నారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలి

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించిన రైతులపై కేసులను ఎత్తివేయాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రజలకు, పంట పొలాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్న కారణంతో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం దిగివచ్చి ఫ్యాక్టరీని రద్దు చేస్తామని ప్రకటించిందన్నారు. అయితే ఉద్యమంలో అనేక మంది మహిళలు, రైతులు, గ్రామ ప్రజలపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. తక్షణమే నమోదైన కేసులన్నీ కొట్టి వేయాల్సిందిగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి కోరారు.

మామడ తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ

మామడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మామడ తహసీల్దార్‌గా జే. శ్రీనివాస్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన సుధాకర్ నిర్మల్ కలెక్టరేట్‌కు సూపరిండెంట్‌గా బదిలీ అయ్యారు. కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్‌గా పని చేసిన శ్రీనివాస్ రావు మామడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో గంగాసాగర్ రెడ్డి, తదితరులు నూతన తహసీల్దార్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

ఒకే దేశం ఒకే ఎన్నికతో సుస్థిర పాలన

భైంసా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సత్వర అభివృద్ధి, సుస్థిర పాలన. సమగ్ర ప్రగతి ఒకే దేశం ఒకే ఎన్నికతో సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ ఆధ్వర్యంలో ఒకే దేశం ఒకే ఎన్నికపై నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమంలో ప్రోగ్రాం జిల్లా కో కన్వీనర్ చిన్నారెడ్డిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పలు దఫాలుగా ఎన్నికలు నిర్వహిస్తుండటం మూలంగా ప్రగతికి విఘాతం కలుగుతోందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పాలనకు ప్రతిబంధకాలు నెలకొంటున్నాయన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక భైంసా మండల, పట్టణ ప్రోగ్రాం కన్వీనర్లుగా ఎన్నికైన సాయినాథ్, దిలీప్‌లను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. ఇందులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగర్ నారాయణ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, భైంసా పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, సుష్మారెడ్డి, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లేలతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలి

క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సంబంధిత వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలని భైంసా అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఫిర్దోస్ జబీన్, ఎస్‌టీఎస్ శేషు కుమార్‌లు పిలుపునిచ్చారు. సోమవారం భైంసా పట్టణ అర్బన్ పీహెచ్‌సీలో క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొనిఇ నిర్వహించిన అవగాహన సదస్సు ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. వ్యాధి నియంత్రణకు, నిర్మూలనకు చేపడుతున్న చర్యలను వివరించారు. టీబీహెచ్‌వీ ఎ. కిషన్, డీపీఎంవో గంగన్న, వైద్య,ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజాన్ని మేలుకొలిపే పుస్తకాలు రూపొందాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాజీరావ్, డా. నగేష్ తదితరులు

భైంసా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కవులు, రచయితలు సమాజాన్ని మేల్కొలిపే, జనాన్ని జాగృతం చేసే రచనలతో పుస్తకాల రూపకల్పన చేపట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాజీరావ్ బోస్లే, మనోరమ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ డా. నగేష్‌లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు వాడేకర్ లక్ష్మన్‌లు పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలో ప్రముఖ రచయిత డా.రెడ్ల బాలాజీ రచించిన గీతావాణి పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజ హితమే అభిమతంగా పెట్టుకొని రచనలు రావాలని ఆకాంక్షించారు.పరభాష వ్యామోహంతో తెలుగు భాష ప్రభావం కోల్పోయే పరిస్థితులు నెలకొన్నయన్నారు. ఇలాంటి ప్రతికూల తరుణంలో భైంసా డివిజన్ ప్రాంత కవులు, రచయితలు తెలుగులో రచనలు చేపడుతూ, పుస్తకాలకు రూపకల్పన చేస్తూ తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకవస్తున్నారని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డా. రెడ్ల బాలాజీ తన రచనలతో సమాజంలో శాంతి స్థాపనకు, ఆధ్యాత్మిక భావాలు పెంపొందింప చేసేందుకు అవిరళంగా కృషి చేస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా గీతా వాణి పుస్తక అవిష్కరణ చేపట్టారు. ఇందులో భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యుడు డా. రజనీకాంత్, చార్టెడ్ అకౌంటెంట్ సంపత్, ఆయుర్వేద వైద్య నిపుణులు డా. గణేష్, పుస్తక రచయిత డా. రెడ్ల బాలాజీతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

ఖానాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... సోమవారం ఖానాపూర్ శివారులోని అంబేద్కర్‌నగర్ సమీపంలో గల చిన్నయ్య పెద్దయ్య గుట్ట వద్ద పోలీస్ కానిస్టేబుల్ మేకల సుధీర్‌కుమార్, హోంగార్డ్ రవీందర్‌లు బ్లూ కోర్ట్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఖానాపూర్ మొగల్పురకు చెందిన మహమ్మద్ మజహార్ అనే వ్యక్తి హెల్మెట్ ధరించకుండా మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. హెల్మెట్ లేని కారణంగా పోలీసులు అతని వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు లేవని తేలింది. దీంతో పోలీసులు విధి నిర్వహణలో భాగంగా ఆ ద్విచక్ర వాహనాన్ని ఫోటో తీశారు. దీంతో సదరు మహమ్మద్ మజహార్ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు.
దీంతో కానిస్టేబుల్ మేకల సుధీర్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మజహార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. వాహనాలు నడిపే వాహనదారులు కచ్చితంగా తమ వెంట అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధ నలను ఖచ్చితంగా పాటించాలని ఎస్సై సూచించారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్కల బారి నుంచి చుక్కల దుప్పిని కాపాడిన హనుమాన్ భక్తులు


తాము కాపాడిన చుక్కల దుప్పితో హనుమాన్ భక్తులు

ఖానాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు ప్రాంతంలోని జంగల్ హనుమాన్ సమీప అడవుల్లో సోమవారం సాయంత్రం కుక్కల బారి నుంచి ఓ చుక్కల దుప్పిని హనుమాన్ భక్తులు కాపాడారు. జంగల్ హనుమాన్ ఆలయ వెనుక భాగంలో గల అటవీప్రాంతం నుంచి కొన్ని కుక్కలు ఓ చుక్కల దుప్పిని వెంటాడుతూ గాయపర్చాయి. హనుమాన్ దీక్ష తీసుకుని అక్కడే ఉన్న దీక్ష స్వాములు నడెం రాకేష్, రొడ్డ విష్ణు, పంబాల ప్రశాంత్, అంజి అనే హనుమాన్ భక్తులు ఆ కుక్కల బారి నుండి చుక్కల దుప్పిని కాపాడారు. గాయపడిన చుక్కల దుప్పిని స్థానిక అటవీశాఖ సెక్షన్ అధికారి రవీందర్‌కు అప్పగించారు. కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పికి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం దానిని తిరిగి అడవుల్లో వదిలి పెట్టనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

'గత పాలకుల నిర్లక్ష్యం ప్రభుత్వ పాఠశాలకు శాపంగా మారింది'


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఈటెల శ్రీనివాస్

లక్ష్మణచాంద, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల నిర్లక్ష్యం ప్రభుత్వ పాఠశాల నిర్వహణకు శాపంగా మారిందని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ సోమవారం ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను స్థానిక నాయకులతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సరైన వసతులు లేక విద్యార్థిని విద్యార్థులు, టీచర్లు నానా అవస్థలు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో సగం కట్టి వదిలేసిన పాఠశాల గది నిర్మాణాలు వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థిని విద్యార్థులకు కనీస అవసరాలు అయిన మరుగుదొడ్ల లేక చెప్పరాని ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంట షెడ్డు నిర్మాణం లేక ఆరుబయట వంటలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, వ్యక్తిగత వ్యాయామశాల నిమిత్తం కొందరు పాఠశాల ఆవరణలో బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణం చేపట్టి అక్రమ కరెంటు పెట్టి కాలక్షేపం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని నిలదీయగా మాకంటే ముందు ఉన్నటువంటి ప్రధానోపాధ్యాయులు పర్మిషన్ ఇచ్చారని సమాధానమిచ్చారన్నారు. అలాగే గేటుకు ఎన్నిసార్లు తాళం వేసిన తాళం పగలగొట్టి మరి లోపలికి వచ్చి కిటికీల ధ్వంసం చేస్తూ సామాన్ల చోరీకి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వాపోయాడన్నారు. పై అన్ని విషయలను కలెక్టర్, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరిపురం నాగేష్, బిల్డింగ్ రజినీకాంత్, సిరాజుద్దీన్, సమ్మెటరవి తదితరులున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

సారంగాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. సోమవారం మండలంలో గల జామ్‌లో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మండల పార్టీ అధ్యక్షులు బి. నర్సయ్య, పార్టీ నాయకులు నారాయణ రెడ్డి, నవీన్ రెడ్డి, రాజు, రాములు, వడ్డేపల్లి రాజు, పవన్, మహేందర్, లింగారెడ్డి, పోతారెడ్డి, భోజన్నలతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడికి పరామర్శ

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాందేడపు చిన్ను సోదరుడు కిషన్ మృతి చెందగా డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు సోమవారం పరామర్శించారు. బుధవార్ పేట్‌లోని చిన్ను నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సంతాపం, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వ ర్, సాయిబాబా ఆలయ చైర్మన్ గంగోని భూరాజ్, గాజులరవి పరామర్శించిన వారిలో ఉన్నారు.

'ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం'

దిలావర్‌పూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఆశా వర్కర్లు అన్నారు. ఆశాల అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పోలీసులు పలువురు ఆశాలను ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మా సమస్యలు పరిష్కరిస్తారని ఆశించామని కాని ప్రశ్నించిన వారిని అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అరెస్టులకు బదులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు.

భయం వీడి లక్ష్యంతో చదవాలి

మామడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు భయం వీడి లక్ష్యంతో చదవాలని ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో గోపిచంద్ అన్నారు. సోమవారం రోజున మండల కేంద్రంలో గల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. రాజు, ఏటీపీ అశోక్, నాగరాజు, వెంకట్ రెడ్డి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంగ్లం పరీక్షకు 11 మంది గైర్హాజరు

నిర్మల్ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి ఆంగ్లం పరీక్షకు సోమవారం 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 9,100 మందికి గాను 9,89 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 99.87 శాతం హాజరు నమోదైందని తెలిపారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కడెం అటవీ రేంజ్ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అధి కారులకు, సిబ్బందికి అనుభవజ్ఞులైన డాక్టర్లతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వారి రక్త నమూనాలు సేకరించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిరంతరం అటవీలో విధులు నిర్వహిస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఎఫ్ఆర్‌వో గీతారాణి సూచించారు.

పంచగుడి గ్రామస్థుల ఆర్థిక సహకారం

లోకేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వట్టోలి గ్రామ సేవకుడు దేవత్ సురేష్ పంచగుడి గ్రామానికి పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పంచగుడి గ్రామస్థులు ఆర్థిక సహాయం అందజేశారు.

కార్యక్రమానికి హాజరైన పాఠకులు





రెండో బహుమతి కూపన్ తీస్తున్న కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు





'కార్ అండ్ బైక్ రేస్' కూపన్ల నుంచి మూడో బహుమతి విజేతను ప్రకటిస్తున్న డిచ్‌పల్లి ఎస్సై ఎండి షరీఫ్



కన్సోలేషన్ విజేతను ప్రకటిస్తున్న పాఠకులు

దమ్మున్న వార్తలు ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

● అట్టహాసంగా కార్ అండ్ బైక్ రేస్ డ్రా

(1వ పేజీ తరువాయి)

ఆ తర్వాత కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు ద్వితీయ బహుమతి విజేతను ఎంపిక చేశారు. రెండో బహుమతి కూపన్ తీయగా.. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన నందాల రాంచందర్ ద్వితీయ బహుమతిగా రిఫ్రిజిరేటర్ గెలుపొందారు. దీంతో రాంచందర్‌కు రామోజీరావు ఫోన్ చేసి.. విజేతగా నిలిచినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామోజీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తమ సమస్యగా భావించి ఎన్నో సమస్యలను పరిష్కరించడంలో 'ఆంధ్రజ్యోతి' ముందు వరుసలో ఉందన్నారు. ఎంతో మంది తమ సమస్యలను 'ఆంధ్రజ్యోతి' పత్రికకు చెప్పుకుంటే పరిష్కారం అవుతాయని భావిస్తున్నారని.. అది చాలా గొప్ప విషయమన్నారు. చిన్న సమస్య అయినా పెద్ద సమస్య అయినా దాన్ని పరిష్కరించడంలో సంస్థ కృషి గొప్పదన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించడంలో సంస్థ కృషి ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. దేశానికి ఇలాంటి పత్రికలు ఎంతో అవసరమన్నారు. పాఠకులను కూడా తమ కుటుంబ సభ్యులుగా భావించి వారికి కూడా బహుమతులు అందజేయాలనే గొప్ప మనస్సు 'ఆంధ్రజ్యోతి'ది అని అన్నారు. పది మందికి ఉపయోగపడే విధంగా ఆంధ్రజ్యోతి పత్రికను నిర్వహిస్తున్న యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ దేశభక్తి ఉన్న గొప్ప ప్రెస్ లీడర్ అని కొనియాడారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా.. 'ఆంధ్రజ్యోతి' మాకు తోడు ఉందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పిస్తున్నారని, ఇది చాలా గొప్ప విషయమని రామోజీ అన్నారు. ఆ తర్వాత డిచ్‌పల్లి ఎస్సై ఎండి షరీఫ్ కూపన్ తీసి మూడవ బహుమతి విజేతను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన రహీమున్నీసాకు తృతీయ బహుమతిగా టీవీ గెలుపొందగా.. ఆమెకు ఎస్సై ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రహీమున్నీసా 'ఆంధ్రజ్యోతి' యజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత పాఠకుల సమక్షంలో 100 కన్సోలేషన్ బహుమతుల కూపన్లు తీసి.. విజేతలను ఎంపిక చేశారు. ఫోన్ ద్వారా ఎంపికైన విజేతలకు సమాచారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ నల్ల తిరుపతిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జీ గుడ్ల సంజీవ్ కుమార్, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ మార్క భాస్కర్, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వర్, కామారెడ్డి స్టాఫ్ రిపోర్టర్ ప్రశాంత్, నిజామాబాద్ ఆర్సీ ఇన్‌చార్జీ బి. ఆంజనేయులు, సంస్థకు సంబంధించిన వివిధ విభాగాల సిబ్బందితో పాటు పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది..

• నందల రాంచందర్, విశ్రాంత ఉపాధ్యాయులు
(రెండో బహుమతి విజేత, బాన్సువాడ)



'ఆంధ్రజ్యోతి' కార్ అండ్ బైక్ రేస్‌లో రెండో బహుమతి దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా 'ఆంధ్రజ్యోతి' పత్రికను క్రమం తప్పకుండా చదువుతున్నాను. వార్తా కథనాలు, ఎడిటోరియల్స్ బాగుంటాయి. అందుకే నేను ఎప్పుడూ 'ఆంధ్రజ్యోతి'కి అభిమానినే..

కార్ అండ్ బైక్ రేస్ కన్సోలేషన్ విజేతలు 100 మంది వీరే..

01. సి. రాజారాం, ఆర్మూర్. 9848133199
02. శ్రీ శివభక్త మార్కండేయస్వామి ఆలయం, గాంధారి. 9000219108
03. గాజ రాజు, బోధన్. 9951256880
04. వై. రాజ్ కుమార్, బిచ్కుంద. 9908929765
05. డి.రాజు, బీర్కూర్. 9849200057
06. బి. మౌనిక, ఆదిలాబాద్. 9908171441
07. మిద్దె లక్ష్మీ, కామారెడ్డి. 9652084480
08. కె. వసుంధర, నిజామాబాద్. 8522931669
09. బెజుగాం కిష్టయ్య, బాన్సువాడ. 9948084224
10. కె.రామగిరి శర్మ, భిక్కనూర్. 9440036633
11. రేఖ శ్రీనివాస్, డిచ్‌పల్లి. 8801408143
12 షేక్ అర్బజ్‌పాషా, నిర్మల్. 9908099580
13 గునకల నాగమణి, సిరికొండ. 9848994872
14 ఏ. రుషికేష్, నిజామాబాద్. 9493276008
15 డి. ప్రవీల, నిజామాబాద్. 9441266668
16 మూడ లహరి, నిజామాబాద్. 7842984899
17 ఎం. అరుణ్, కామారెడ్డి. 9492739007
18 జి. లక్ష్మణ్, నిజామాబాద్. 7081234299
19 కె. ఉషా, కామారెడ్డి. 9666822783
20 డి. అక్షిత, నిజామాబాద్. 9649181987
21 జి. శివరాజ్, నిజామాబాద్. 8897877607
22 వి. లక్ష్మీకాంత్‌రావు, ఎడపల్లి. 9848965458
23 టి. సావిత్రి, గాంధారి. 8500828377
24 ఆర్. సంగీత, నిజామాబాద్. 7013903466
25 ఎ. లక్ష్మి, సిరికొండ. 8106458777
26 బి. గణేష్, నిజామాబాద్. 9949821987
27 పి. శిరీష, నిజామాబాద్. 8686184646
28 వై. ప్రేమ్ కుమార్, వర్ని. 7780276479
29 టి. తరిణి, నిజామాబాద్. 9494877980
30 ఎం. ప్రవీణ్, బోథ్. 9441994653
31 ఎం. అశోక్ కుమార్, కామారెడ్డి. 8186801108
32 ఆర్. రమేష్ చారి, బాన్సువాడ. 9676122624
33 టి. దివ్య, గాంధారి. 9390094044
34 టి. ప్రశాంత్, డిచ్‌పల్లి. 7997942213
35 ఎ. రేఖ, రుద్రూర్. 9491177932
36 డి. సోన్, దోమకొండ. 9912320323
37 కె. శరత్ కుమార్, మిర్జాపూర్. 9542122542
38 యల్. రామాగౌడ్, అంబం(ఆర్) 9177864062
39 బానాల రాజశేఖర్, కామారెడ్డి. 9440557891
40 సీహెచ్. హర్షిత్, నిజామాబాద్. 9441038482
41 జి. గిరీశం, మోస్రా. 7675040400
42 వి. నగేష్, భీమ్‌గల్. 9542568795
43 ఆర్. శ్రీహరి, రెడ్డిపేట్. 7848867144
44 ఆర్. సంజన, భీమ్‌గల్. 9640366112
45 వి. పద్మజ, బోధన్. 9440442246
46 పెరుక నిహాల్, కామారెడ్డి. 8317625984
47 జి. శ్రీకర్, నిజామాబాద్, 9133201060
48 రెబ్బ నరేష్, ధర్పల్లి. 9441736352
49 ఎం. సాయగౌడ్, గర్గుల్. 9440071899
50 కొత్తింటి విశాల్‌రెడ్డి, ధర్పల్లి. 9912110028
51 కె. జగన్నాథం, నిజామాబాద్. 9640216661
52 బి. భోజన్న, దేగాం. 9848754505
53 డి. సత్యం, మెండోరా. 9550696697
54 ఆర్. పరశురాం, డిచ్‌పల్లి. 9394471935
55 సీహెచ్. గంగాకిషన్, నందిపేట్. 9848981102
56 పి. సాయరెడ్డి, నిర్మల్. 9666963574
57 జె. రఘు, గాంధారి. 8978324765
58 పి. అంజలి, నిజామాబాద్. 8074162584
59 ఆర్. రమేష్ గౌడ్, నిజామాబాద్. 9392223399
60 పి. సందీప్, నిజామాబాద్. 9441926477
61 ఎం.సాయిచరణ్, నిజామాబాద్. 9666764832
62 కె. నర్సింహారెడ్డి, కామారెడ్డి. 9948144025
63 జి. కృష్ణమూర్తి, భిక్కనూర్. 9133215005
64 సీహెచ్. హరీష్, నిజామాబాద్. 9059609993
65 సీహెచ్. రాజేశ్వరి, నిజామాబాద్. 7799992020
66 కె. నరేష్, పాల్వంచ. 8465025913
67 ఎస్. మోహన్‌రెడ్డి, వన్నెల్(బి). 9441861911
68 ఆకుల నారాయణ, కామారెడ్డి. 9440222032
69 ఎండి ఇనాయతుల్లా, పాల్వంచ. 9618207186
70 బి. నివేదిత, నిజామాబాద్. 9493292668
71 ఎం. నరేష్, బోథ్. 9440493385
72 బి. ప్రభాకర్‌రావు, బోర్గాం(పి). 9912192292
73 జి. రఘువీర్, నిజామాబాద్. 9705308760
74 శ్రీగాద రాజేందర్, దోమకొండ. 9912540690
75 షైలారం సురేష్, భిక్కనూర్. 9032998186
76 బడాల లక్ష్మీ చిన్నవాల్గోట్. 9912433246
77 సర్ల రాధాకృష్ణ, నవీపేట్. 9490299439
78 బీస భూమయ్య, నిజామాబాద్. 9490403566
79 బండ స్వప్న, నిజామాబాద్. 9293133105
80 దారం గంగాధర్, నిజామాబాద్. 9848384777
81 ఎంఎస్. వినోద్, మంథని. 9948214187
82 జి. ప్రణయ్, యానంపల్లి. 9959590371
83 యు.సత్యనారాయణ గౌడ్, మాక్లూర్. 8309363055
84 బి. భార్గవి, అంకాపూర్. 9951998289
85 ఓరుగంటి అక్షయ్, ఆర్మూర్. 8885395406
86 అనగంటి రమ్య, ఉట్నూర్. 7093311524
87 తోట సంధ్యారాణి, ఆర్మూర్. 7337429137
88 వి. రాంరెడ్డి, కామారెడ్డి. 9948826484
89 పత్రి బాలకిషన్, భీమ్‌గల్. 8897456404
90 డి. మంజుల, ఆర్మూర్. 9491741445
91 జి. శ్రీనివాస్, పాల్వంచ. 9949286180
92 ఖాత లింబాద్రి, వన్నెల్(బి). 7036176057
93 జీవీవీఎస్ఎన్. ప్రసాద్, వర్ని. 9441801737
94 కె. శంకర్‌గౌడ్, అయిలాపూర్. 9490901309
95 గుంచెట్టి విఠల్, భైంసా. 9440086765
96 దాసరి గణేష్, బోర్గాం(పి). 8886439019
97 ఇత్తడి ప్రవీణ్, తాడ్వాయి. 8096839741
98 సుచరిత, నిజామాబాద్. 970326662
99 జి. మోహన్, ఆర్మూర్. 9908400499
100 కె. నరేష్, ఆర్మూర్. 9440023408













కన్సోలేషన్ బహుమతుల డ్రాలో పాల్గొన్న పాఠకులు



ట్రిపుల్ ఐటీలో నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అలరించిన త్రినయ ఉత్సవం

బాసర, మార్చి, 24 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో అంతప్రజ్ఞ టెక్ ఫెస్టివల్‌లో భాగంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన త్రినయ ఉత్సవం అందరిని అలరింపజేసింది. ఈ సాంస్కృతిక ఉత్సవంలో విద్యార్థులు సాంప్రదాయ నృత్య ప్రదర్శనతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషాల్లో పాటలు ఆలపించడం, పల్లె పాట జానపద గేయాలతో అలరించారు. సంగీత నృత్యమే కాకుండా ఫ్యాషన్ ప్రదర్శనతో కొత్త తరహా దుస్తుల మోడల్స్‌ను ప్రదర్శించారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ సాంస్కృతి కార్యక్రమం ఆద్యాంతం చూపరులను ఆకట్టుకుంది. ప్రతిభ కనబరిచిన వారికి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఏవో రణధీర్ తదితరులు బహుమతులను అందజేశారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఎల్‌ఆర్ఎస్‌కు స్పందన అంతంతే

- 25 శాతం రాయితీ ప్రకటించినా.. కానరాని స్పందన
- మూడు మున్సిపాలిటీల్లో 16,841 మంది దరఖాస్తు
- మరో ఆరు రోజుల్లో ముగియనున్న గడువు



భైంసా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం

భైంసా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన ఎల్ఎర్ఎస్ కార్యక్రమానికి జిల్లాలోని మూడు మున్సిపల్ కేంద్రాల దరఖాస్తుల నుంచి స్పందన కరువైంది. ఈ నెలాఖరు వరకు ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే ఫీజులో 25శాతం రాయితీ ఇస్తామని ప్రకటించినా స్పందన అంతంత మాత్రంగానే ఉంది. అధికార యంత్రాంగం సంబంధిత ప్రక్రియపై విస్తృత ప్రచారం చేపడుతున్నా ఆశించిన స్పందన కానరావడం లేదు. మరో ఆరు రోజుల వ్యవధిలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ గడువు ముగియనుంది.

16,841 మంది దరఖాస్తుదారులు

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కేంద్రాల్లో మొత్తం 16.841 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గాను రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నిర్మల్ మున్సిపల్ పరిధిలో 9,631 మంది, భైంసా మున్సిపల్ పరిధిలో 6,276 మంది, ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 934 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు మూడు మున్సిపాలిటీల పరిధిలో కేవలం 438 మంది దరఖాస్తుదారులు మాత్రమే ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకొని ఎల్అర్ఎస్ ద్వారా తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. ఇందులో నిర్మల్ మున్సిపల్ పరిధిలో 300 మంది దరఖాస్తుదారులు రూ.1.65 కోట్లు, భైంసా మున్సిపల్ పరిధిలో 110 మంది రూ.17.15 లక్షలు, ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 28 మంది రూ.8.49 లక్షలు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు.

విస్తృత ప్రచారం

రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నిండుకోవడంతో ఎల్ఆర్ఎస్ ద్వారా కొంత మేర ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని భావించి రుసుంలో 25 శాతం రాయితీ ప్రకటించింది. 2020 ఆగస్టు 26వ తేదీలోపు సేల్ డీడ్ ద్వారా రిజిష్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమానులు, ప్లాట్ ఓనర్లకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని వేగిరపెట్టినా కూడా ఎవరు కూడా రుసుం చెల్లించేందుకు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించి విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తోంది. అవగాహన సమావేశాలు నిర్వహించడంతో పాటు మున్సిపల్ కేంద్రాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, మైక్‌ల ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. అంతేకాకుండా మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయడం, దరఖాస్తుదారులందరికీ మున్సిపల్ కార్యాలయం నుంచి ఫోన్లు చేస్తున్నారు. అయినప్పటికీ నామమాత్రపు స్పందన సైతం కరువవుతోంది.

ప్రతిబంధకంగా మారిన సాంకేతిక సమస్యలు


ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే ప్రక్రియకు సాంకేతిక సమస్యలు ప్రతిబంధకంగా మారాయి. క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ మొరాయిస్తోంది. అప్పుడప్పుడు ప్లాట్ల క్రమబద్ధీకరణ నిర్వహించుకునేందుకు దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయాలకు వస్తుండగా సైట్ పని చేయకుండా పోతోంది. గంటల తరబడి దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయాల్లో ఎదురుచూపులు చూస్తూ వెను తిరిగిపోతున్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

నిర్మల్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ, శివ పంచాయతన, శ్రీయంత్రోద్ధారక ఆంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు శివ పార్వతుల కల్యాణం, విశేష పూజలు, హోమాలు, అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దత్తాత్రేయ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన డీఈవో

బోథ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను సోమవారం ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారి ప్రణీత తనిఖీ చేశారు. మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ఆదర్శ పాఠశాల (కౌటబి) గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణను ఆయా సెంటర్లలోని ప్రత్యేక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాక మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ సైతం కేంద్రాలను పరిశీలించారు.



'కార్ అండ్ బైక్ రేస్' డ్రా కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



కూపన్ల డ్రా తీస్తున్న నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



మొదటి విజేతకు ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తున్న దృశ్యం



విజేతను ప్రకటిస్తున్న కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ రామోజీరావు



కార్యక్రమంలో పాల్గొన్న పాఠకులు

దమ్మున్న వార్తలు ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

- నిక్కచ్చిగా కథనాలు రాస్తూ దూసుకెళ్తోంది..
- నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ దేశభక్తి ఉన్న గొప్ప ప్రెస్ లీడర్
- కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు
- అట్టహాసంగా 'కార్ అండ్ బైక్ రేస్' కూపన్ల డ్రా

డిచ్‌పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దమ్మున్న వార్తలు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకమని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) శివారులో గల యూనిట్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్' కూపన్ల డ్రా కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్, కిరణ్ కుమార్, అతిథులుగా కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ రామోజీరావు, డిచ్‌పల్లి ఎస్సై ఎండి షరీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలాదిగా వచ్చిన కూపన్ల నుంచి మొదటి బహుమతి విజేతను అడిషనల్ కలెక్టర్ ఎంపిక చేశారు. జిల్లాలోని ఎడపల్లికి చెందిన తిరునగిరి వెంకటరమణ డ్రాలో మొదటి బహుమతి బైక్‌ను దక్కించుకోగా.. ఆయనకు అడిషనల్ కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ప్రథమ బహుమతి విజేత వెంకట రమణ ఆనందానికి అవధులు లేవు. అదనపు కలెక్టర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఏబీఎన్ దమ్మున్న ఛానల్ అని, దమ్మున్న వార్తలు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకత అన్నారు. నిజాయితీగా వార్తలు రాస్తూ పాఠకుల అభిమానాన్ని చూరగొంటుందన్నారు. అదే సమయంలో పాఠకులకు మరింత చేరువయ్యేందుకు 'ఆంధ్రజ్యోతి' ఇలాంటి 'కార్ అండ్ బైక్ రేస్' ద్వారా పాఠకుల మన్ననలు మరింత పొందేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే ప్రజల మన్ననలను పొందుతూ పత్రిక రంగంలో దూసుకెళ్తుందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ దమ్మున్న పత్రికగా 'ఆంధ్రజ్యోతి'కి పేరు ఉందన్నారు. పాఠకులకు కూడా బహుమతులు ఇచ్చే గొప్ప సంప్రదాయాన్ని 'ఆంధ్రజ్యోతి' కొనసాగించడం అభినందనీయమన్నారు.



డ్రా తీస్తున్న పాఠకురాలు

మిగతా 7వ పేజీలో...

మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది..

: తిరునగిరి వెంకట రమణ, ఎడపల్లి

'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కూపన్ డ్రాలో నాకు మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. నేను పదేళ్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రికను చదువుతున్నా. నిజాన్ని నిర్భయంగా రాసి ప్రజలను చైతన్య పరుస్తున్న 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు.



మొదటి బహుమతి
తిరునగిరి వెంకటరమణ
(ఎడపల్లి, నిజామాబాద్)

రెండో బహుమతి
నందాల రాంచందర్
(బాన్సువాడ, కామారెడ్డి)

మూడో బహుమతి
రహీమున్నీసా
(బోథ్, ఆదిలాబాద్)

ఐటీడీఏ గిరిజన దర్బార్‌లో సమస్యల వెల్లువ



ఉట్నూర్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న ఐటీడీఏకు తరలివచ్చారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పరిపాలన అధికారి దామోదర స్వామి, పీవీటీజీ ఏపీఓ మేస్రం మనోహర్‌లు అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.


క్షయవ్యాధిని పూర్తిగా నివారించాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిని పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజలు కూడా దీనిపై అవగాహన పెంచుకోవాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిమ్స్‌లోని ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వైద్య విద్యార్థులకు టీబీ వ్యాప్తి, నివారణ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చికిత్స విధానాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అంతకు ముందుకు విద్యార్థులు, రంగోళి, పెయింటింగ్, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ అశోక్, వైద్యులు సందీప్ జాదవ్, విద్యావిల్సాన్, మేడికోలున్నారు.

బాధితులను పరామర్శించిన ఖానాపూర్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న గాదిగూడ, ఉట్నూర్, నార్నూర్, జైనూర్ మండలాలకు చెందిన బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వారివెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జైనూర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు నాయకులు ఆత్రం వెంకట్ పాల్గొన్నారు.

బండిసంజయ్‌పై ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు



కేంద్ర మంత్రిపై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఉట్నూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రిచంద్రశేఖర్‌రావుపై అసత్య ఆరోపణలు చేసిన బండి సంజయ్‌పై చట్టరీత్యాచర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ నాయకులు ఉట్నూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పొన్నసాయికుమార్, జాడి వెంకటేశ్, సూర్యభానుయాదవ్, కొత్తపెల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

మావల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పట్టణంలోని భగత్ సింగ్‌నగర్‌లో కేంద్రీయ విద్యాలయం భవనాలు నిర్మిస్తున్నారు. కొంతమంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే వారిపై కాలనీ వాసులు గొడవకు దిగి, దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు మావల పోలీస్‌స్టేషన్‌లో 10వ తేదీన ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. కాగా రాజు, సమీర్, అర్షప్‌లను మావల పోలీసులు సోమవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.



- మావల మండల కేంద్రంలో నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఎడతెగని.. డబుల్ పంచాయితీ

- జిల్లాలో కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- గతంలో లక్కీడ్రా నిర్వహించినా.. లబ్ధిదారుల్లో అయోమయం
- ప్రజా పాలన కార్యక్రమంలో గృహలక్ష్మికి వేలల్లో దరఖాస్తులు
- సొంతింటి కోసం నిరుపేదలకు తప్పని ఎదురుచూపులు
- జిల్లావ్యాప్తంగా 3,862 'డబుల్' ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 518 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి

ఆదిలాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంచాయతీ ఏళ్ల తరబడి ఎడతెగడం లేదు. అసలు అర్హులైన లబ్ధిదారులకు డబుల్ ఇళ్లను కేటాయిస్తారా? లేదా? అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతను ఇవ్వడం లేదు. దీంతో నిరుపేద లబ్ధిదారుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఎదురుచూసే ఓపిక లేక సొంతంగానే అప్పు చేసి ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. మొదటి నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకానికి అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా అధికారికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించిన దాఖలాలు లేవు. కాని కొన్నిచోట్ల అనాధికారికంగానే డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉంటున్నారు. నిర్వహణ లేకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా.. ఉపయోగం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు ప్రభుత్వం 3,862 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో 3,381 ఇళ్లకు మాత్రమే పరిపాలన అనుమతులు వచ్చాయి. 3,098 ఇళ్లకు అధికారులు టెండర్లను ఖరారు చేశారు. ఇందులో కేవలం 1,902 ఇళ్లకు మాత్రమే టెండర్లు పూర్తయ్యాయి. దీంతో 1,298 ఇళ్ల నిర్మాణ పనులు మొదలైనా.. వివిధ దశల్లోనే కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు 518 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. మిగిలిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకుండానే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇది కూడా జిల్లాలో నామమాత్రంగానే కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి మోడల్ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి యేడాదిన్నర గడిచిపోతున్నా.. సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

హడావుడి చేసినా.. అంతే సంగతి!!

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఎంతో హడావుడి చేసినా.. లబ్ధిదారులకు కేటాయించకుండానే నిర్లక్ష్యంగా వదిలేసింది. దీంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై లబ్ధిదారులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయినా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం అడుగు ముందుకు పడడం లేదు.



- వివిధ దశల్లో ఉన్న 'డబుల్' ఇళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఎలాంటి ఆదేశాలు లేవు

: బసవేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి

జిల్లాలో గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలను జారీ చేయలేదు. మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించడం జరిగింది. అయినా ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఇందిరమ్మ ఇళ్ల పైనే ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తాం.

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో లక్కీ డ్రా ద్వారా 782 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. అయినా ఇప్పటి వరకు ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇల్లును కేటాయించ లేదు. దీంతో లబ్ధిదారుల్లో అయోమయం కనిపిస్తోంది. అసలు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు మాత్రం కనిపించడం లేదు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీ, మావల, జైనథ్, ఉట్నూర్, తదితర గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు దాదాపుగా పూర్తయినా.. లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి.

ఒకే గ్రామానికి పరిమితమైన 'ఇందిరమ్మ'

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకే గ్రామానికి పరిమితమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మిగితా గ్రామాల ప్రజలకు ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. డబుల్ బెడ్‌రూం పథకాన్ని పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదరబాదరగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించినా.. ప్రయోజనమే లేదంటున్నారు. గత నెల రోజులుగా మోడల్ ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. అక్కడక్కడ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా.. నాణ్యత లేకపోవడంతో నగుబాటుగా మారుతున్నాయి. గత నాలుగైదు రోజుల క్రితం నార్నూర్ మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణ దశలోనే కూలిపోవడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభంలోనే పథకం పరిస్థితి ఇలా ఉంటే.. ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేసి అర్హులైన

(తరువాయి 6వ పేజీలో...)

సమస్యలుంటే పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలి



ఎస్పీని సన్మానిస్తున్న బాధిత రైతులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి సమస్యలున్నా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గత సంవత్సరం పోస్టుఆఫీస్‌లో రైతుల ఖాతాల్లోని డబ్బులను మేనేజర్ తన సొంత ఖాతాల్లోకి మళ్లించిన కేసులో ఆరుగురికి తిరిగి వారి ఖాతాల్లో డబ్బులను జమచేయించారు. దీంతో సోమవారం రైతులు ఎస్పీని కలిసి శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఆధునిక సమాజంలో సైబర్‌నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీతోపాటు సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్ల ఢిల్లీకి సంబంధించిన అధికారులతో మాట్లాడారని, వారి వల్లనే సమస్య పరిష్కారమైందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీతోపాటు సైబర్ డీఎస్పీకి వారు ధన్యవాదాలు తెలిపారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా



అర్జీదారుల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీలను అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు వివిధ రకాల సమస్యలపై అర్జీలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయాల చుట్టు తిరగకుండా అర్జీదారుని సమస్యపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు వచ్చాయని, తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఇందులో రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్‌కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్, శాంతినగర్, ఆదిలాబాద్‌లో 24వ తేదీ సోమవారం టీఎస్ కేసీ(తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్), ప్లేమెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సీస్ బ్యాంకులో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులకు 35 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 8 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పర్చుకుంటూ ఎక్కడ అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత, సెల్ కో-ఆర్డినేటర్ మంజుల తెలిపారు. జాబ్‌మేళాలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది, టీఎస్‌కేసీ మెంటర్ ఎండీ.ఇమ్రాన్ అలీ, హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ మేనేజర్ వినయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.34 (మంగళవారం సాయంత్రం)

సహర్ : 4.54 (బుధవారం ఉదయం)

దేవుడు (అల్లాహ్) మీ మొహాలను, మీవద్ద ఉన్న ఆస్తిపాస్తులను, ధన రాశులను, మీ దగ్గరున్న సంపదను చూడడు. మీలో ఉన్న దాతృత్వాన్ని గుణ గణాలను, సత్ప్రవర్తనను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాడు.